సాక్షి రంగారెడ్డి

శుక్రవారం । 4 । అక్టోబర్ । 2024



విజయవంతం చేయండి

కామారెడ్డిలో జరిగే భారతీయ కిసాన్ సంఘ్ సభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి కోరారు. 8లో▸



ముమ్మర సోదాలు

షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి ఆదేశాల మేరకు గురువారం పోలీసులు తలకొండపల్లి పరిధిలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. 8లో▸



సమస్యలు పరిష్కరించండి

టీఎస్‌డీడీసీఎఫ్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన గుత్తా అమిత్‌రెడ్డిని స్థానిక నేతలు కలిసి సమస్యలను విన్నవించారు. 8లో▸

న్యూస్‌రీల్

బాలాపూర్ లడ్డూ ప్రసాదం కేంద్రమంత్రికి అందజేత



కిషన్‌రెడ్డికి లడ్డూను అందిస్తున్న శంకర్‌రెడ్డి

బడంగ్‌పేట్: ప్రసిద్ధి చెందిన బాలాపూర్ గణపతి లడ్డూను ప్రధాని మోదీకి అందించేందుకు ఏర్పాట్లు చేయించాలని లడ్డూ గ్రహీత, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కొలన్ శంకర్‌రెడ్డి గురువారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. అనంతరం ఆయనకు లడ్డూ ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉన్నారు.

నూతన నియామకం



సబితారెడ్డిని కలిసిన కందుకూరు పీఏసీఎస్ డైరెక్టర్ ఆనంద్ తదితరులు

కందుకూరు: హైదరాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ కోఆప్షన్ సభ్యుడిగా ఎస్సీ కోటా కింద కందుకూరు పీఏసీఎస్ డైరెక్టర్ పొట్టి ఆనంద్ నియమితులయ్యారు. ఈ మేరకు డీసీసీబీ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య నుంచి ఆయన నియామక పత్రం అందుకున్నారు. ఈ క్రమంలో ఆనంద్ గురువారం స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, వైస్ చైర్మన్ విజేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్‌ముదిరాజ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సురేష్, డైరెక్టర్ నర్సింహ, నాయకులు కాకి దశరథ, దేశం కృష్ణారెడ్డి, సురసాని దర్శన్‌రెడ్డి, నవీన్, దయ్యాల శ్రీనివాస్, రాజు, దయానంద్, ప్రశాంత్, రాకేష్, ఎం.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మోదీ పాలనపై ఇష్టంతో స్వచ్ఛందంగా సభ్యత్వం



బీజేపీ సభ్యత్వ నమోదు చేయిస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

బడంగ్‌పేట్: ప్రధాని మోదీ పాలన నచ్చి దేశ ప్రజలంతా బీజేపీ సభ్యత్వాన్ని ఇష్టపడి తీసుకుంటున్నారని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లో గురువారం నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని స్థానికులతో సభ్యత్వ నమోదు చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ప్రపంచ దేశాలు మెచ్చిన నేత అని కొనియాడారు. దేశ ప్రజలంతా ఆయన పాలనను ఇష్టపడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్, కార్పొరేటర్లు ఇంద్రసేన, తోట శ్రీధర్‌రెడ్డి, నిమ్మల సునీత, అమిత పాల్గొన్నారు.

కొనసాగుతున్న సర్టిఫికెట్ల పరిశీలన



అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

ఇబ్రహీంపట్నం: డీఎస్సీ–2024 అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన ఎల్బీనగర్‌లోని ప్రభుత్వ జిల్లా ఉన్నత పాఠశాలలో కొనసాగుతోంది. 1:3 నిష్పత్తి మేరకు ఎంపికైన అభ్యర్థులను సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు పిలిచిన సంగతి తెలిసిందే. గురువారం పెద్ద సంఖ్యలో ఎంపికైన అభ్యర్థులు ఈ కేంద్రానికి తరలివచ్చారు. వారికి ఇబ్బందులు కలుగకుండా అధికారులు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలించి, అధికారులు సూచించిన విధంగా విద్యార్హతలకు సంబంధించిన జిరాక్స్ ప్రతులను అభ్యర్థులు అందజేశారు. శనివారంతో ఈ గడువు ముగియనుంది. 9వ తేదీన టీచర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాలు అందజేయనున్నారు. ఒక పోస్టుకు ముగ్గురు అభ్యర్థుల చొప్పున సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు పిలవడంతో ఉద్యోగాలు పొందే అదృష్టవంతులెవరో 9వ తేదీలోపు తేలనుంది.

ఉక్కిరిబిక్కిరి!



ప్రభుత్వంపై ప్రతిపక్షాల ముప్పేట దాడి

- మూసీ కూల్చివేతలతో నిరసన సెగ
- బాధితులకు అండగా బీఆర్ఎస్ ఆందోళనలు
- ఆరుగ్యారంటీల అమలును ఎత్తి చూపుతున్న బీజేపీ
- కిమ్మనని డీసీసీలు, ఎమ్మెల్యేలు, ఇతర కాంగ్రెస్ నేతలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ప్రతిపక్షాల దూకుడు, ప్రజల నిరసనలతో అధికార కాంగ్రెస్ పార్టీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. పవర్‌లోకి వచ్చిన పది నెలల్లోనే గ్రేటర్ జిల్లాల ప్రజల నుంచి వ్యతిరేకత ఎదుర్కొంటోంది. హైడ్రా దూకుడు, మూసీలో పేదల ఇళ్ల కూల్చివేతలను వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష బీఆర్ఎస్ పోరుబాట పట్టింది. రైతు రుణమాఫీ సహా ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయాల్సిందిగా బీజేపీ ఒత్తిడి తెస్తోంది. ఎంఐఎం సైతం అదే స్థాయిలో విరుచుకు పడుతోంది. మూడు పార్టీలు కలిసి అధికారపార్టీపై ముప్పేట దాడి చేస్తుండగా.. దీటుగా కౌంటర్ ఇవ్వడంలో గ్రేటర్ కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నేతలు వెనుకాడుతున్నారు. దీంతో అసలు డీసీసీ పాలకవర్గాలు ఉన్నాయా? అనే అనుమానం కూడా వ్యక్తమవుతోంది.

ప్రశ్నార్థకంగా డీసీసీ పాలక వర్గాలు

అధికార పార్టీ దూకుడుకు అప్పటి వరకు విలవిల్లాడిన బీఆర్ఎస్.. బాధితుల పక్షాన ప్రత్యక్ష పోరాటానికి దిగింది. సీఎం రేవంత్‌రెడ్డి ఏకపక్ష నిర్ణయంతో విమర్శలు ఎక్కుపెట్టింది. ఇదే సమయంలో మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ కూడా బాధితులకు బాసటగా నిలిచారు. చైతన్యపురిలో ప్రత్యక్ష ఆందోళనకు దిగారు. ఆరు గ్యారంటీల అమలుకు ఒత్తిడి కోసం ఆ పార్టీ ఇందిరా పార్కు వద్ద 24 గంటల దీక్ష చేపట్టింది. ఎంఐఎం నేతలు కూడా హైడ్రా కూల్చివేతలకు వ్యతిరేక గళం విప్పారు. నిజానికి ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు ఎనిమిది మంది వరకు ఉన్నారు. హైదరాబాద్ జిల్లాలో ముగ్గురు డీసీసీ అధ్యక్షులు ఉన్నారు. రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లోనూ ఆ పార్టీ నేతలు ఉన్నారు. వీరిలో ఏ ఒక్కరూ కూడా ప్రతిపక్షాల విమర్శలకు దీటుగా కౌంటర్ ఇవ్వకపోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల రెవెన్యూమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇళ్లు, ఫాంహౌస్‌ల్లో ఐటీ, ఈడీ దాడులు చేసింది. అయినా ఏ ఒక్క కాంగ్రెస్ నేత కూడా ఆయనకు మద్దతుగా మీడియా ముందుకు రాకపోవడాన్ని పరిశీలిస్తే.. క్షేత్రస్థాయి లీడర్ల పని తీరు స్పష్టమవుతోంది. మరోవైపు మాజీ మంత్రి కేటీఆర్, మంత్రి కొండా సురేఖ మధ్య నెలకొన్న అంతర్గత వివాదం చినికిచినికి గాలివానలా మారి కాంగ్రెస్‌కు మరిన్ని చిక్కులు తెచ్చిపెట్టింది.

నాటి స్పందన నేడేది?

అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ హవా కొనసాగించింది. గ్రేటర్ జిల్లాల్లో మాత్రం ఆశించిన ఫలితాలు పొందలేకపోయింది. ఉమ్మడి జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో మినహా మరెక్కడా పాగా వేయలేక పోయింది. పాతబస్తీలోని ఏడు స్థానాలను ఎంఐఎం సొంతం చేసుకుంటే.. మిగిలిన స్థానాల్లో ప్రతిపక్ష బీఆర్ఎస్ గెలుపొందింది. రేవంత్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజులకే రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, చేవెళ్ల ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. మరికొంత మంది చేరికకు కూడా రంగం సిద్ధమైంది. ఇదే సమయంలో చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం హైడ్రాను ఏర్పాటు చేసింది. హయత్‌నగర్, ఉస్మాన్‌సాగర్ వంటి జంట జలాశయాల చుట్టే కాకుండా గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, మియాపూర్, నార్సింగి, అమీన్‌పూర్ సహా రాజేంద్రనగర్, పాతబస్తీలోని పలు చెరువులు, కుంటల్లో వెలసిన అక్రమ నిర్మాణాలను కూల్చివేసింది. పెద్దల ఫాంహౌసులు, బఫర్ జోన్లు, ఎఫ్‌టీఎల్‌లో వెలసిన అక్రమ భవంతులను వదిలేసి, సాధారణ పేద, మధ్య తరగతి ఇళ్లను కూల్చడం వివాదాస్పదమైంది. బాధితులు, స్థానిక ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీనికి తోడు ఆరు గ్యారంటీల అమలులోనూ ప్రభుత్వం విఫలమైందనే విమర్శలు పెరుగుతున్నాయి.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

రైతులకు ఇబ్బంది రానీయొద్దు

- పకడ్బందీగా ధాన్యం కొనుగోలు చేపట్టండి
- అధికారులు, మిల్లర్ల సమావేశంలో కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సంబంధిత అధికారులు, మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ధాన్యం తీసుకొచ్చిన వెంటనే తూకం జరిపించాలని సూచించారు. సన్నరకం వరి, ముతక రకాలను ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వేరు చేయాలని అన్నారు. సన్నరకం వరి, ముతక రకం వరిని వేర్వేరుగా ట్యాగ్ చేయబడిన రైస్ మిల్లులకు జారీ చేసిన కేటాయింపు ఆధారంగా డేటా ఎంట్రీని రోజువారీ ప్రాతిపదికన చేయాలన్నారు. కేంద్రాల వద్ద సరిపడా సంఖ్యలో హమాలీలు సేవలందించేలా ఏర్పాట్లు ఉండాలని, రైస్ మిల్లుల వద్ద కూడా ధాన్యం లోడ్‌లతో కూడిన లారీలు నిలిచి ఉండకుండా ఎప్పటికప్పుడు ధాన్యం నిల్వలను దిగుమతి చేసుకునేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలన్నారు. ధాన్యం తరలింపులో జాప్యానికి తావులేకుండా చూడాలని, ధాన్యం నిల్వలు తరలించేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు, ప్యాడి క్లీనర్లు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సన్నరకం, ముతక రకానికి సంబంధించి ధ్రువీకరణ కోసం అధికారులకు అవసరమైన శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, తూనికలు, పొట్టు రిమూవర్, తేమ యంత్రం వంటి అన్ని మౌలిక సదుపాయాల ను ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి శ్రీనివాస్, సివిల్ సప్లయ్ డీఎం గోపీకృష్ణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నర్సింహారావు, జిల్లా మార్కెటింగ్ అధికారి మహ్మద్ రియాజ్, డీసీఓ సుధాకర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అందరికీ ఫ్యామిలీ డిజిటల్ కార్డులు

అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్



పెద్దమ్మ తండాలో సర్వేలో పాల్గొన్న అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్

మహేశ్వరం: ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ డిజిటల్ కార్డులు అందజేస్తామని అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. మండల పరిధిలోని పెద్దమ్మ తండాలో ఫ్యామిలీ డిజిటల్ కార్డుల పైలట్ కార్యక్రమాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి పేదవాడికి రేషన్ కార్డు ఇవ్వాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉందన్నారు. 30 శాఖల నుంచి సమాచారం క్రోడీకరించి ఫ్యామిలీ డిజిటల్ కార్డులో పొందుపర్చామన్నారు. ఒక్క క్లిక్‌తో లబ్ధిదారుల సమాచారం అంతా తెలుస్తుందన్నారు. నియోజకవర్గంలో మహేశ్వరం మండలం పెద్దమ్మ తండా పంచాయతీని ఫ్యామిలీ డిజిటల్ కార్డుల పైలట్ కార్యక్రమం కింద ఎంపిక చేసినట్టు చెప్పారు. అంతకు ముందు పెద్దమ్మ తండాలో అధికారులు పర్యటించి ఇంటింటికీ తిరిగి సర్వే చేపట్టారు. రేషన్ కార్డు ఉందా.. ఇంట్లో ఎంత మంది ఉన్నారు.. ఎవరైనా చనిపోయారా.. కుటుంబంలో సభ్యులు పెరిగారా.. తదితర వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఫ్యామిలీ డిజిటల్ కార్డుల పైలట్ ప్రాజెక్టు మహేశ్వరం నియోజకవర్గ ప్రత్యేకాధికారి రాజు, తహసీల్దార్ సైదులు, ఎంపీడీఓ శైలజ, డిప్యూటీ తహసీల్దార్ నవత, ఆర్ఐలు పావని, స్వర్ణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



ఆదిబట్ల మున్సిపాలిటీలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు ప్రక్రియను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు ఇంటింటి సర్వేను ఆదిబట్ల మున్సిపాలిటీలోని 9వ వార్డులో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వంలోనే న్యాయం చేకూరుతుందన్నారు. దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి పేదలకు రేషన్‌కార్డు, పెన్షన్లు ఇచ్చారని.. ఆరోగ్యశ్రీ కూడా ఆయన పుణ్యమే అని గుర్తుచేశారు. ఇంటింటికీ తిరిగి దండోర వేయించి డిజిటల్‌కార్డు తీసుకునేలా అధికారులు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి, ఆదిబట్ల మాజీ సర్పంచ్ శేఖర్‌గౌడ్, శేరిగూడ పీఏసీఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి, మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, నాయకులు వెంకటేశ్వర్లు, శివ కుమార్, సాంబయ్యగౌడ్ పాల్గొన్నారు.

అంతా అనుకున్నట్టే..

- పెద్దఅంబర్‌పేట మున్సిపల్ పీఠంపై పండుగల జయశ్రీ
- 24 మంది కౌన్సిలర్లలకు గాను 21మంది ఆమెకే మద్దతు
- తాజా మాజీ చైర్‌పర్సన్ స్వప్న వ్యక్తిగత కారణాలతో మరో ఇద్దరు గైర్హాజరు



జయశ్రీకి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఆర్డీఓ సాయిరాం, కమిషనర్ రవీందర్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట మున్సిపల్ పీఠాన్ని ఎట్టకేలకు 8వ వార్డు కౌన్సిలర్ పండుగల జయశ్రీ దక్కించుకున్నారు. తాజా మాజీ చైర్‌పర్సన్ చెవుల స్వప్నపై 17మంది కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టి నెగ్గడంతో ఆమె పదవిని కోల్పోయిన సంగతి తెలిసిందే. దీంతో కొత్త చైర్‌పర్సన్ ఎన్నిక కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలోని తట్టి అన్నారం వార్డు కార్యాలయంలో చేవెళ్ల ఆర్డీఓ సాయిరాం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కౌన్సిల్ సమావేశంలో 24 మంది కౌన్సిలర్లకు గాను 21 మంది హాజరయ్యారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పండుగల జయశ్రీకి మద్దతు పలికి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశం అనంతరం స్పెషల్ ఆఫీసర్ సాయిరాం, మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి జయశ్రీకి నియామకపత్రం అందజేశారు. అనంతరం జయశ్రీ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో పాటు స్థానిక కౌన్సిలర్లు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలకు అతీతంగా తనకు స్వచ్ఛందంగా మద్దతు పలికి చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్న కౌన్సిల్ సభ్యులందరి సహకారంతో పురపాలక సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఇద్దరు కౌన్సిలర్లు వ్యక్తిగత కారణాలతో సమావేశానికి హాజరు కాలేకపోయారు. తాజా మాజీ చైర్‌పర్సన్ చెవుల స్వప్న సమావేశానికి హాజరు కాకపోగా ఒంటరిగా మిగిలిపోయారు.

ఎట్టకేలకు నెరవేరిన కల

మున్సిపల్ పీఠాన్ని సొంతం చేసుకోవడానికి ఏడాదిన్నర కాలంగా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న పండుగల జయశ్రీ కల ఎట్టకేలకు నెరవేరింది. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేగా మల్‌రెడ్డిరంగారెడ్డి గెలుపు తర్వాత, పురపాలక సంఘం పరిధిలోని కౌన్సిలర్లంతా పార్టీలకు అతీతంగా ఆమెను చైర్‌పర్సన్‌గా ఎన్నుకునేందుకు చేసిన ప్రయత్నాలన్నీ విజయవంతం కావడంతో అటు జయశ్రీతో పాటు కౌన్సిలర్లంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



విఠాయిపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడానికే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఫ్యామిలీ డిజిటల్ కార్డుల ప్రక్రియను చేపట్టిందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు విఠాయిపల్లిలో గురువారం ఫ్యామిలీ డిజిటల్ కార్డు ప్రక్రియను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలను సక్రమంగా, మరింత సమర్థవంతంగా అందించడానికే ఫ్యామిలీ డిజిటల్ కార్డులు రూపొందిస్తోందని చెప్పారు. కుటుంబంలో ఉన్న సభ్యులంతా డిజిటల్ కార్డు కోసం తమ వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు పొందిన తరువాత రేషన్‌తో పాటు అన్ని ప్రభుత్వ సౌకర్యాలు ఎక్కడి నుంచైనా పొందడానికి వీలుంటుందని ఆయన వివరించారు. కార్యక్రమంలో కందుకూరు ఆర్డీఓ అనంతరెడ్డి, తహసీల్దార్ లలిత, మున్సిపల్ కమిషనర్ వసంత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, కేఎస్ఆర్ సేవాదళం అధ్యక్షుడు మెకానిక్ బాబా, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు ప్రారంభం

రాంనుంతల గ్రామంలోని రైతువేదికలో ఆమనగల్లు, కడ్తాల మండలాల మంచినీటి సరఫరా సిబ్బందికి ఐదు రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మిషన్‌భగీరథ డీఈఈలు మోహన్‌రెడ్డి, రామకృష్ణ, ఎంపీడీఓ వినోద, ఏఈలు సందీప్‌కుమార్, వాగ్దేవి, శరత్, శ్రావ్య, రాజేశ్వర్, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మను స్మరిస్తూ.. తరిస్తూ

ప్రారంభమైన దసరా
శరన్నవరాత్రి మహోత్సవాలు


పూజలో పాల్గొన్న భక్తులు, నాయకులు

కడ్తాల్: ప్రకృతి రమణీయ క్షేత్రంగా ప్రసిద్ధిగాంచిన మైసిగండి మైసమ్మ ఆలయ పరిధిలో శివాలయ రామాలయ దేవస్థానంలో కొలువైన శ్రీ అన్నపూర్ణేశ్వరి మహాలక్ష్మీ జ్ఞాన సరస్వతిదేవి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలలో భాగంగా తొలిరోజు ఆలయంలో విఘ్నేశ్వర, కలశ పూజలు, ధ్వజారోహణం, చండీ హోమం నిర్వహించారు. తొలిరోజు శ్రీ అన్నపూర్ణదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో స్నేహలత, ఆలయ ఫౌండర్ ట్రస్టీ శిరోలి, తహసీల్దార్ జ్యోతి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాటనర్సింహ, నాయకులు బీచ్యానాయక్, రాఘవేందర్, భాస్కర్‌నాయక్, అరుణ్‌కుమార్ ఆలయ అర్చక సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సభలు విజయవంతం చేయండి


నినాదాలు చేస్తున్న భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు

- భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి
- ఈ నెల 5న కామారెడ్డిలో కిసాన్ రాష్ట్ర మహాసభలు

మొయినాబాద్/మొయినాబాద్‌రూరల్: కామారెడ్డిలో ఈ నెల 5న జరిగే భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సామ మాధవరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మొయినాబాద్ మండల కేంద్రంతో పాటు నక్కలపల్లి, తోల్‌కట్ట, ఎత్‌మార్‌పల్లి, చాకలిగూడ, కనకమామిడి, అప్పారెడ్డిగూడ, ముర్తుజాగూడ, అమ్డాపూర్ తదితర గ్రామాల్లో రాష్ట్ర మహాసభలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. వరంగల్ సభలో ప్రకటించిన రైతు డిక్లరేషన్‌ను అమలు చేయాలని.. రైతుభరోసా, వరికి రూ.500 బోనస్ ఇవ్వాలన్నారు. ధరణి సమస్యలు పరిష్కరించి రైతుల ఇబ్బందులను తీర్చాలన్నారు. ఈ సమస్యలన్నింటిపై కామారెడ్డిలో జరిగే రాష్ట్ర మహాసభల్లో చర్చ జరుగుతుందన్నారు. జిల్లాలోని రైతులందరూ మహాసభలకు పెద్ద ఎత్తున తరలివెళ్లి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సుధాకర్‌రెడ్డి, శంకర్, కృష్ణ, నాయకులు శ్రీనివాస్, సీహెచ్.సుధాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, శివ, రైతులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మొయినాబాద్: కడుపునొప్పి బాధ భరించలేక యాసిడ్ తాగిన ఓ మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా తాండూరుకు చెందిన సున్నం జగ్గమ్మ(28) తన మేనమామ అయిన పులిపర్తి అంబోజీతో కలిసి మూడేళ్లుగా మొయినాబాద్ మండలం నజీబ్‌నగర్ గ్రామంలో ఉంటున్నారు. మతిస్థిమితం సరిగా లేని జగ్గమ్మ కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతుంది. కాగా బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు విపరీతమైన కడుపునొప్పి రావడంతో బాధ భరించలేక యాసిడ్ తాగింది. వెంటనే ఆమెను చికిత్స కోసం నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఇంటి తాళం పగలగొట్టి లూటీ

నాలుగు తులాల బంగారం చోరీ

యాచారం: ఇంటి తాళాలు పగలగొట్టి చోరీ చేసిన ఘటన హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆకులామైలారంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అవారు జంగయ్య మూడు రోజుల కింద నగరంలోని బంధువుల ఇంటికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. తిరిగి గురువారం ఇంటికి వచ్చి చూసే సరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో ఉన్న నాలుగు తులాల బంగారం, రూ.10 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్‌టీం పోలీసులు ఇంటిని సందర్శించి వివరాలు సేకరించింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహారావు తెలిపారు.

‘ఆది-అంతం’ తేల్చాల్సిందే!

- రూ.1.21 కోట్లు సీజ్ చేసిన సుల్తాన్‌బజార్ పోలీసులు
- ముగ్గురు హుండీ ఏజెంట్ల పట్టివేత
- ఎవరు... ఎవరికి పంపారన్నది ఇప్పటికీ మిస్టరీనే
- ఐటీ, ఈడీ దర్యాప్తులోనూ ఈ అంశాలు బయటకు




సాక్షి, సిటీబ్యూరో: నగరంలో మరోసారి అక్రమ ద్రవ్యమార్పిడి దందా వెలుగులోకి వచ్చింది. ఈస్ట్‌జోన్ పరిధిలోని సుల్తాన్‌బజార్ పోలీసులు ముగ్గురు ఏజెంట్లను పట్టుకుని... రూ.1.21 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల హడావుడి ముగిసిన తర్వాత ఇంత పెద్ద మొత్తంలో నగదు దొరకడం ఇదే తొలిసారి. ఈ వ్యవహారంలో ఏజెంట్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఆ మొత్తానికి సంబంధించిన ‘ఆది-అంతం’ గుర్తించాల్సి ఉంది. భవిష్యత్తులో ఆదాయపుపన్ను శాఖ (ఐటీ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఎంటరైతే కరెన్సీ కట్టల వెనుక ఉన్న కీలకాంశాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

‘లోకల్’ అయితే హుండీ పేరుతో...

రెండు దేశాల మధ్య జరిగే అక్రమ ద్రవ్య మార్పిడిని హవాలా అని, ఒకే దేశంలోని వివిధ ప్రాంతాల మధ్య జరిగే మార్పిడిని హుండీగా పేర్కొంటారు. నగరం కేంద్రంగా సాగే దందాలో హవాలా కంటే హుండీనే ఎక్కువగా ఉంటుంది. సాధారణంగా ఈ రెండు రకాలైన మార్గాలను పన్ను ఎగ్గొట్టేందుకు వ్యాపారస్తులు ఎక్కువగా వినియోగిస్తుంటారు. ఎన్నికల సీజన్‌లో ఆయా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తమ అనధికారిక ఖర్చుల కోసం అక్రమ ద్రవ్యమార్పిడి మార్గాన్నే ఆశ్రయిస్తుంటారు. నగరంలోని బేగంబజార్, సుల్తాన్‌బజార్, సికింద్రాబాద్, పాట్‌మార్కెట్‌లతో పాటు ఓల్డ్ సిటీలోని కొన్ని ప్రాంతాల కేంద్రంగానే ఈ అక్రమద్రవ్య మార్పిడి ఎక్కువగా జరుగుతోంది.

ముగ్గురిని పట్టుకున్న పోలీసులు...

ఈస్ట్‌జోన్ పరిధిలో ఉన్న సుల్తాన్‌బజార్ పోలీసులు మంగళవారం రూ.1.21 కోట్ల అక్రమ నగదు స్వాధీనం చేసుకున్నారు. హనుమాన్‌టెక్డీ వద్ద లక్ష్మణ్, వసంత్‌లను పట్టుకుని వీరి నుంచి రూ.కోటి స్వాధీనం చేసుకున్నారు. వీరిని విచారించిన నేపథ్యంలో సమీపంలోని శివ టవర్స్‌లో ఉండే ఏజెంట్ తరుణ్ విషయం బయటికి వచ్చింది. దీంతో అతడి కార్యాలయంపై దాడి చేసిన పోలీసులు అతడిని పట్టుకోవడంతో పాటు మరో రూ.21 లక్షల నగదు సీజ్ చేశారు. ముంబైకి చెందిన బబ్లు ఈ దందాకు కీలక సూత్రధారిగా వెలుగులోకి వచ్చింది. పరారీలో ఉన్న ఇతడి కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

ఇచ్చే వారు, పుచ్చుకునే వారు ఎవరు?

హవాలా, హుండీ దందాలు కేవలం ఏజెంట్ల మధ్య సాగవు. ఉత్తరాదిలో ఉన్న సూత్రధారులకు ఇక్కడి వాళ్లు ఏజెంట్లుగా వ్యవహరిస్తారు. వారి నుంచి వచ్చే ఆదేశాల ఆధారంగా నగరంలోని వ్యాపారుల నుంచి నిర్ణీత మొత్తం తీసుకోవడం, వారికి డెలివరీ చేస్తుంటాడు. మరోపక్క ఇక్కడి వాళ్లు అందించే నగదునూ తీసుకుని ఉత్తరాదిలో ఉన్న తమ ఏజెంట్లకు సమాచారం ఇస్తారు. వారు అక్కడ ఉన్న వారికి ఆ మొత్తం డెలివరీ చేస్తుంటారు. ఈ లావాదేవీలన్నీ రూ.10 నోటు ఆధారంగా జరుగుతాయి. నగదు తీసుకున్న ఏజెంట్ ఓ నోటు సీరియల్ నెంబర్ చెప్తాడు. నగదు తీసుకునే వ్యక్తి అక్కడి ఏజెంట్‌కు ఈ నెంబర్ చెప్తేనే నగదు ఇస్తారు. ఈ నోటు ఫొటోను ఇద్దరు ఏజెంట్లు వాట్సాప్ ద్వారా షేర్ చేసుకుంటారు.

ఆ విభాగాలు తేల్చాల్సిందే...

ఇలాంటి అక్రమ ద్రవ్యమార్పిడి కేసుల దర్యాప్తులో పోలీసులకు పాత్ర పెద్దగా ఉండదు. కేవలం అనుమానాస్పదంగా ఉన్న నగదు స్వాధీనం చేసుకుని, బాధ్యులను అదుపులోకి తీసుకుంటారు. ఇతర నేరాలకు సంబంధించి కోణం లేకపోతే ఆ మొత్తాన్ని ఆదాయపు పన్ను శాఖకు అప్పగిస్తారు. సుల్తాన్‌బజార్ పోలీసులు పట్టుకున్న ముగ్గురూ ఏజెంట్లే. వీరికి నగదు ఇచ్చింది ఎవరు? ఆ మొత్తాన్ని తీసుకువెళ్లి ఎవరికి ఇవ్వాలనుకున్నారు? తదితర అంశాలు ఆ శాఖతో పాటు ఈడీ రంగంలోకి దిగితే ఆ విభాగం నిగ్గు తేల్చాల్సిందే. ఈ కేసును ఆదాయపు పన్ను శాఖ అధికారులు అన్ని కోణాల్లోనూ క్షుణ్ణంగా దర్యాప్తు చేసే అవకాశం ఉంది.

సమస్యలు పరిష్కరించండి

టీఎస్‌డీడీసీఎఫ్ చైర్మన్‌కు విన్నవించిన పాడిరైతు సంఘం నాయకులు


అమిత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

కడ్తాల్: తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ (టీఎస్‌డీడీసీఎఫ్) చైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన గుత్తా అమిత్‌రెడ్డిని గురువారం స్థానిక నేతలు కలిసి పలు సమస్యలను విన్నవించారు. ఆయనను హైదరాబాద్‌లోని లాలాపేట్ విజయ డెయిరీ ప్రధాన కార్యాలయంలో కడ్తాల్ డెయిరీ సొసైటీ అధ్యక్షుడు చేగూరి వెంకటేశ్ ఆధ్వర్యంలో పాడి రైతు సంఘం నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇటీవలే పాడి రైతులకు రెండు పాల బిల్లులు చెల్లించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా పెండింగ్‌లో ఉన్న మిగతా పాల బిల్లులు కూడా దసరా పండుగ లోపు చెల్లించి, పాడి రైతులకు భరోసా కల్పించాలని కోరారు. కడ్తాల్ పాలశీతలీకరణ కేంద్రంలో నిర్మాణం పూర్తయి ఏడాది గడిచినా షాపింగ్ కాంప్లెక్స్ భవన సముదాయాన్ని ఇప్పటి వరకు ప్రారంభించలేదన్నారు. అలాగే పాలశీతలీకరణం చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టాలని చైర్మన్‌ను కోరారు. ఈ మేరకు సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు బీచ్యానాయక్, జగన్ నాయక్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు


మాణిక్యంరెడ్డి (ఫైల్)

మొయినాబాద్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పెద్దమంగళారం గ్రామానికి చెందిన బొడ్డు మాణిక్యంరెడ్డి(39) నగరంలో హౌస్‌కీపింగ్ పనిచేస్తూ లంగర్‌హౌస్‌లో ఉంటున్నాడు. కాగా ఈ నెల 1న సాయంత్రం పెద్దమంగళారంలోని తన ఇంటికి వచ్చాడు. తన వద్ద ఉన్న కవర్‌ను ఇంట్లో పెట్టి బయటకు వెళ్లాడు. రాత్రి అయినా తిరిగి ఇంటికి రాలేదు. లంగర్‌హౌస్ ఇంటికి కూడా వెళ్లలేదు. దీంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వెతికారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ అరెస్టు

ఇబ్రహీంపట్నం రూరల్: అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్‌ను ఆదిబట్ల పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్, ఆదిబట్ల ఏరియాల్లో ఉన్న లేబర్‌కు గంజాయి అమ్మడానికి ఓ వ్యక్తి వస్తున్నాడనే సమాచారంతో పోలీసులు గస్తీ కాశారు. బొంగ్లూర్ సర్వీస్‌రోడ్డు దగ్గర గురువారం సాయంత్రం ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తుక్కుగూడ వైపు నడుచుకుంటూ వెళ్తుండగా అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఒక ప్యాకెట్‌లో ఒకటిన్నర కిలోలు, మరొక ప్యాకెట్‌లో 50 గ్రాముల బ్యాంకాక్ గంజాయి లభ్యమైంది. అతడు మహారాష్ట్రకు చెందిన రాం భరత్ కల్యాణ్‌గా గుర్తించారు. ఇతడు కేరళ నివాసి అయిన టోబీ వద్ద గంజాయి కొనుగోలు చేసి బెంగళూర్ పరిసరాల్లో విక్రయించేవాడు. గతంలో వివిధ పోలీస్‌స్టేషన్లలో భరత్ కల్యాణ్‌పై గంజాయి కేసులు ఉన్నాయని తెలిపారు. ఈ మేరకు విచారణ చేస్తున్నామని పోలీసులు చెప్పారు. మాదకద్రవ్యాలు విక్రయించే మరో వ్యక్తిని అరెస్టు చేసినట్లు సమాచారం.

వాల్యూయర్స్ డే

ఖైరతాబాద్: బ్యాంకు రుణాలను సురక్షితంగా కాపాడటంలో వాల్యూయర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని ఎస్‌బీఐ హెచ్‌ఎల్‌ఎస్‌టీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ బి.రాములు తెలిపారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ వాల్యూయర్స్ హైదరాబాద్ ఆధ్వర్యంలో గురువారం ప్లాజా హోటల్‌లో 55వ వాల్యూయర్స్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ బి.రాములు మాట్లాడారు. ఇటీవలి హైడ్రా కూల్చివేతలలో బ్యాంకు రుణాలకు సంబంధించిన ఆస్తులు ఏవీ ప్రభావితం కాకుండా తమ సేవలను అందించినందుకు అన్ని బ్యాంకుల ప్యానెల్ వాల్యూయర్స్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఇనిస్టిట్యూషన్ ఆఫ్ వాల్యూయర్స్ చైర్మన్ పి.మధు, సెక్రటరీ కె.చిరంజీవి, మాజీ చైర్మన్లు దేశ్‌పాండే పాల్గొన్నారు.

భార్యాభర్తలను బెదిరించి..

ఐదున్నర తులాల బంగారు నగలు ఎత్తుకెళ్లిన దుండగులు

చేవెళ్ల: రోడ్డు పక్కన భోజనం చేస్తున్న భార్యాభర్తలను బైక్‌పై వచ్చిన దుండగులు కత్తులతో బెదిరించి ఐదున్నర తులాల బంగారు నగలు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫరూక్‌నగర్ మండలం దేవునిపల్లి గ్రామానికి చెందిన మంగలి బసప్ప అతని భార్య లక్ష్మమ్మ(మంగమ్మ)కు చికిత్స నిమిత్తం చేవెళ్లలోని మహేందర్‌రెడ్డి ఆస్పత్రిలో పరీక్షలు చేసుకునేందుకు కారులో వచ్చారు. పరీక్షల అనంతరం రిపోర్టు మధ్యాహ్నం వస్తుందని చెప్పడంతో దగ్గర్లోని చిలుకూరు బాలాజీ దర్శనానికి వెళ్లారు. దైవ దర్శనం చేసుకొని తిరిగి వస్తుండగా మార్గమధ్యలో మండలంలోని కేసారం బస్టాప్ సమీపంలో రోడ్డు పక్కన కారును ఆపి భోజనం చేసేందుకు కూర్చున్నారు. అదే సమయంలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి కత్తితో బెదిరించి వారి వద్ద ఉన్న ఐదున్నర తులాల బంగారు కమ్మలు, పుస్తెలతాడు తీసుకొని పారిపోయారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రాణం తీసిన సిగరెట్ గొడవ..

అమీర్‌పేట: అనుమానస్పద మృతి కేసులో మిస్టరీని ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు ఛేదించారు. హత్య చేసి మెట్లెక్కబోతూ జారిపడగా కడుపులో కత్తి గుచ్చుకుని చనిపోయాడని కట్టు కథ అల్లినట్లు గుర్తించారు. నిందితుల మాటలపై అనుమానం రావడంతో ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించగా ఓ ఇంటి సీసీ కెమెరాలో హత్య దృశ్యాలు నిక్షిప్తమయ్యాయి. దీంతో పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం చెప్పాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బల్కంపేటకు చెందిన సర్దార్ గురుప్రీత్‌సింగ్ (26) సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేసేవాడు.మంగళవారం సాయంత్రం అతను కృష్ణానగర్‌లోని ఓ మద్యం షాపు వద్ద తన పెదనాన్న కుమారుడు సర్దార్ బల్వీర్ సింగ్‌ను కలిశాడు. అప్పటికే అక్కడ బల్వీర్‌సింగ్ స్నేహితులు కరణ్‌సింగ్ పేరుతో ఉన్న ఇద్దరు వ్యక్తులు, ఏఆర్ కానిస్టేబుల్ సాయి ఉన్నారు. ఐదుగురు కలిసి మద్యం సేవించారు. అనంతరం సాయి సిగరేట్ వెలిగించగా తనకు సిగరెట్ పొగ పడదని గురుప్రీత్ అభ్యంతరం చెప్పడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అనంతరం అక్కడి నుంచి వెళ్లి అమీర్‌పేట సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వెనక ఓ షాపు వద్ద కూర్చుని మరోసారి ఫుట్ మద్యం తాగారు. ఆ తర్వాత సాయి సిగరెట్ వెలిగించగా అభ్యంతరం చెప్పిన గురుప్రీత్‌సింగ్ సాయి బైక్ తాళాలు లాక్కున్నాడు. దీతో ఇద్దరి మధ్య గొడవ జరగడంతో బల్వీందర్ అడ్డుకుని తమ్ముడిని మందలించాడు. తమ్ముడినైన తనవైపు కాకుండా కానిస్టేబుల్‌కు మద్దతుగా మాట్లాడతావా అంటూ గురుప్రీత్ అతడితో వాదనకు దిగాడు. బైక్ తాళాలు ఇవ్వమని అడుగుతున్నా ఇవ్వకపోవడంతో ఆగ్రహానికి లోనైన బల్వీందర్ కత్తితో తమ్ముడి కడుపులో పొడిచాడు. గాయాపడిన అతడిని చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వీరు జరిగిన సంఘటనపై కట్టు కథ అల్లారు. అర్ధరాత్రి ఇంటికి వచ్చి మెట్లపై జారి పడటంతో నడుముకు ఉన్న కంజర్ (కత్తి) కడుపులో గుచ్చుకోవడంతో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు చెప్పారు. మృతుడి తండ్రికి సైతం ఫోన్ చేసి ఇదే విషయం చెప్పారు. బస్తీ నాయకులు సైతం నిందితుడికి వత్తాసు పలికి కేసును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించగా హత్య దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. ప్రధాన నింధుతుడైన బల్వీందర్‌సింగ్‌తో పాటు మరో ముగ్గురిపై హత్య కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న ఏఆర్ కానిస్టేబుల్ సాయి, కరణ్‌సింగ్‌ల కోసం గాలిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు.

పోలీసుల ముమ్మర సోదాలు


దుకాణంలో తనిఖీ చేస్తున్న పోలీసులు

తలకొండపల్లి: ప్రజాలందరూ చట్టానికి లోబడి వ్యవహరించాని పోలీసులు పేర్కొన్నారు. గురువారం షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి ఆదేశాలన మేరకు స్థానికంగా కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇద్దరు ఇన్‌స్పెక్టర్‌లు, ఏడుగురు ఎస్‌ఐలు, షాద్‌నగర్ సబ్ డివిజన్ సిబ్బందితో కలిసి చుక్కాపూర్, పడకల్, గట్టు ఇప్పలపల్లి, తలకొండపల్లి తదితర గ్రామాల్లో పోలీసులు పర్యటించారు. పాన్, కిరాణ షాపులు తనిఖీ చేశారు. బెల్టు షాపుల్లో అక్రమంగా మద్యం విక్రయాలు, నిల్వ ఉంచడం, నిషేధించబడిన మాదక ద్రవ్యాలు, గంజాయి, నిషేధిత పొగాకు తదితర వాటి కోసం వెతికారు. బెల్టు షాపులపై దాడులు నిర్వహించి వాహనాల తనిఖీలు నిర్వహించారు. వివిధ సెక్షన్ల కింద మూడు కేసులు నమోదు చేశారు. కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్, ఎస్‌ఐలు శ్రీకాంత్, వెంకటేష్, రాజ్ కుమార్, సుశీల, విజయ్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

మూసీ వంతెన.. దాటాలంటే నరకయాతన



ఛిద్రమైన వంతెనతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని గౌరెల్లి గ్రామం నుంచి ప్రతాపసింగారం వెళ్లే మార్గంలో మూసీ నది బ్రిడ్జిపై గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిస్తోంది. వర్షాలకు కురిసినప్పుడు వంతెనపై నీళ్లు నిలిచి శిథిలావస్థకు చేరుకుంటుంది. దీంతో పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వెంటనే అధికారులు వంతెనకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. – అబ్దుల్లాపూర్‌మెట్